# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# LEGISLATIVE ASSEMBLY DEBATES

## అధికార నివేదిక
## OFFICIAL REPORT

**సోమవారం, జూన్ 10, 2013**

**13 వ శా. స. XII – II సమావేశం, వాల్యూం -- III నంబరు -- 1**

**శక సంవత్సరం – 1935, జ్యేష్ఠం – 20**

## MONDAY, THE 10th JUNE, 2013

**13 L.A. XII - II SESSION, VOL— III No. - 1**

**20 - Jyeshtha, 1935 - S.E.**

#


శాసన సభ సచివాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు – 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ నాదెండ్ల మనోహర్ |
| ఉప సభాపతి | : | శ్రీ మల్లు భట్టి విక్రమార్క |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ పి. కిష్టా రెడ్డి<br>శ్రీ జి. వెంకట శేషు<br>శ్రీ ఆర్.వి. సుజయ కృష్ణ రంగారావు<br>శ్రీమతి ఎ. ఉమా మాధవ రెడ్డి<br>శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ |
| కార్యదర్శి | : | శ్రీ ఎస్. రాజ సదారాం |
| ఉప కార్యదర్శులు | : | శ్రీమతి వి.గిరిజాసుందరి<br>శ్రీ కె. సత్యనారాయణ రావు<br>శ్రీ జి. వెంకటకృష్ణ<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల<br>శ్రీ జె. రామలింగేశ్వర రావు<br>శ్రీ హెచ్. ఎ. షఫీ<br>శ్రీ ఎం. విజయ రాజు<br>శ్రీ వి. రమేష్ కుమార్<br>శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ సూరజ్ బహదూర్<br>శ్రీ కె. రాజ్ కుమార్<br>శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీ ఎస్. రామ నరసింహం<br>శ్రీమతి టి. సత్యవేద కుమారి<br>శ్రీమతి ఎ. చంద్రభాగ<br>శ్రీమతి వి.ఎస్. ప్రసన్న కుమారి<br>శ్రీమతి పి. శివదీక్ష |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ బి.ప్రభాకర్ రావు |

-------------

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ చర్చలు

## అధికార నివేదిక

**( 13వ శాసన సభ )**

**(12వ సమావేశపు రెండవ సమావేశము : మొదటి రోజు)**

**సోమవారం, జూన్ 10, 2013**

**సభ ఉ. గం.10.00 లకు ప్రారంభమైనది**

**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

----------

# విషయ సూచిక

1. సంతాప ప్రతిపాదన

శ్రీ కృష్ణాజిల్లా అవనిగడ్డ శాసన సభ్యులు శ్రీ అంబటి బ్రాహ్మణయ్య మృతికి  సంతాపము

-------

ఉ.10.00

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ

**సోమవారం, జూన్ 10, 2013**

***

**(సభ ఉదయం 10.00 గంటలకు సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)**

***

(Interruptions)

## సంతాప ప్రతిపాదన

## శ్రీ కృష్ణాజిల్లా అవనిగడ్డ శాసన సభ్యులు శ్రీ అంబటి బ్రాహ్మణయ్య మృతికి సంతాపము

MR. SPEAKER: I am advising the Hon'ble Members not to display placards in the House. Let us proceed with the Condolence Motion. గౌరవ ముఖ్యమంత్రి గారు..

శ్రీ ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి (ముఖ్యమంత్రి) : ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. బ్రాహ్మణయ్య గారు వార్డు మెంబర్ నుంచి సర్పంచ్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా మొన్న సభలో ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రతి పదవి కాలంలో కూడా వారు రైతులకు కార్మికులకు ఎనలేని సేవను చేసిన వ్యక్తి. ఆయన ఎప్పుడు కూడా రైతు సమస్యలను లేక పేద వారి సమస్యలను సభలో లేవనెత్తే వారు. వారు రైతులకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. నియోజక వర్గంలోనే కాదు, జిల్లాలోనే కాదు, రాష్ట్ర స్థాయిలో కూడా వారు కార్యక్రమాలను చేపట్టారు. వారు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుకొని విలువలతో కూడిన రాజకీయం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబానికి ఇటువంటి కష్ట సమయంలో మేమందరం కలిసికట్టుగా ఉన్నామని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (కుప్పం) : అధ్యక్షా, అంబటి బ్రాహ్మణయ్య గారు తెలుగుదేశం పార్టీలో ఒక సీనియర్ నాయకులుగా మాజీ పార్లమెంటు సభ్యులుగా, రైతుల పట్ల ఎనలేని అభిమానంతో రాజీలేని పోరాటం చేసిన వ్యక్తిగా, అవనిగడ్డ శాసన సభ్యులుగా ఉండి 73 సంవత్సరాల వయస్సులో అనారోగ్యంతో ఇక్కడ గ్లోబల్ ఆసుపత్రిలో చనిపోవడం జరిగింది. నేను పాదయాత్రలో ఉన్నప్పుడు నాకు సమాచారం వస్తే ఆయన్ని కాపాడుకోవాలి బ్రతికించుకోవాలనే ఉద్దేశంతో గ్లోబల్ ఆసుపత్రిలో స్పెషలిస్ట్‌లు ఉన్నారనే ఉద్దేశంతో నిమ్స్ నుండి గ్లోబల్ ఆసుపత్రికి షిఫ్ట్ చేయమని రిక్వెస్ట్ చేశాము. అక్కడ ట్రీట్‌మెంట్ ఇప్పించినప్పటికీ ఆయన్ని కాపాడుకోలేకపోయాం.

కృష్ణా జిల్లాలో నాగాయలంక మండలం ఒక్కబొట్లవారి పాలెంలో అంబటి బ్రాహ్మణయ్య గారు జన్మించారు. గ్రామ స్థాయిలో పంచాయితీ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ ఆయన వచ్చారు. మొదట పంచాయితీ బోర్డ్ అధ్యక్షులుగా పని చేశారు. అక్కడ నుంచి సర్పంచ్‌గా ఆ గ్రామానికి ఎనలేని అభివృద్ధి కార్యక్రమాలను చేశారు. 1981-88 మధ్య కాలంలో అవనిగడ్డ సమితి అధ్యక్షులుగా ఎంపికయ్యారు. సమితి అధ్యక్షులుగా ఎంపికై, ఉత్తమ సమితి ప్రెసిడెంట్‌గా కూడా ఆయన అవార్డ్‌ని తీసుకున్నారు. అదే మాదిరిగా విద్యా రంగానికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి బ్రాహ్మణయ్య గారు. 1986-88 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ కృష్ణా

జిల్లా అధ్యక్షులుగా పని చేయడం, 1988-90 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పుడు ఎన్.టి.రామారావు గారు అనేక విధాలుగా ఆయన్ని అభినందించే వారు. ఆయన ఒక వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి. నీతికి నిజాయితీకి నిలువుటద్దం బ్రహ్మణయ్య గారు. అదే మాదిరిగా 1990-94 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షులుగా మరలా ఎంపికయ్యారు. 1994-99 మధ్య కాలంలో బందరు శాసన సభ్యుడిగా ఎంపిక కావడం, అదే సమయంలో ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎంఏ (పొలిటికల్ సైన్స్) పట్టాను పొందడం జరిగింది. 1999-2004 మధ్య కాలంలో మచిలీపట్నం శాసనసభ్యుడిగా ఎంపికయ్యారు. మరలా జిల్లా పార్టీ అధ్యక్షులుగా పని చేశారు. 2004-2009 మధ్య కాలంలో కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షులుగా కొనసాగి తొమ్మిది సంవత్సరాల పాటు జిల్లా పార్టీ అధ్యక్షులుగా పని చేసిన వ్యక్తి బ్రాహ్మణయ్య గారు. 2009లో అవనిగడ్డ శాసన సభ్యుడిగా ఎంపిక కావడం, ఆయన ఎక్కడ ఉన్నా అభివృద్ధి కార్యక్రమాలను చేయాలనే ధ్యాస తప్ప మరొకటి ఉండేది కాదు. పెనుమూడి పులిగడ్డ వారధి వచ్చిందంటే ఆయన చేసిన ఎనలేని కృషి వల్లనే ఆ వారధి రావడం జరిగింది. ఆయన ఎప్పుడు కూడా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో చాలా పట్టుదలగా, జిల్లాలోని రైతాంగం కోసం పాదయాత్రను కూడా చేసి చాలా పెద్ద ఎత్తున ముందుకు పోయిన వ్యక్తి. జీవితంలో ఆయన అనుకున్నవన్నీ కొంత వరకు చేయగలిగారు. అయితే, లాస్ట్ మూమెంట్‌లో ఆయనకు అనారోగ్యం రావడం, ఎన్ని ప్రయత్నాలు చేసినా కాపాడుకోలేకపోవడం జరిగింది. ఆయన స్ఫూర్తి ఎప్పటికీ శాశ్వతంగా ఉంటుంది. అదే మాదిరిగా గవర్నమెంటుని కోరుతున్నాను. ఒక మంచి శాసన సభ్యుడు లేక ఒక మంచి ప్రజాప్రతినిధిగా ప్రజలకు గుర్తుండే విధంగా, స్ఫూర్తిదాయకంగా ఉండాలంటే ఆయన విగ్రహాన్ని గవర్నమెంటు పరంగా అవనిగడ్డలో ఏర్పాటు చేయడం, ఆయనను ప్రజలు గుర్తు పెట్టుకునే విధంగా అక్కడ జిల్లాలో ఏదైనా మంచి ప్రాజెక్టుకు ఆయన పేరును పెడితే చాలా బాగుంటుంది. అది కూడా ఆలోచించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదే మాదిరిగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

శ్రీమతి వై.ఎస్.విజయమ్మ (పులివెందుల): అంబటి బ్రాహ్మణయ్య గారి మృతి పట్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. రాజకీయాల్లో అన్ని రకాలైన పదవుల్లో సర్పంచ్ నుండి ఎంపీ వరకు నిర్వహించి ఎంతో నిరాడంబరంగా నిజాయితీగా ఉన్న వ్యక్తి, మంచి వ్యక్తి. ఆయన నమ్మిన సిద్ధాంతాలకు విలువలకు కట్టుబడి ఉన్నారు. మనం ఆయన వ్యక్తిత్వాన్ని స్ఫూర్తిగా తీసుకోవచ్చు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబానికి దేవుడు ఆదరణ ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకొంటున్నాము.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం): అధ్యక్షా, అంబటి బ్రాహ్మణయ్య గారు 1964వ సంవత్సరంలో ఒక్కబొట్లవారిపాలెం గ్రామ వార్డు సభ్యుడిగా వైస్ సర్పంచ్‌గా, సర్పంచ్‌గా అవనిగడ్డ సమితి అధ్యక్షులుగా, బందరు శాసన సభ్యుడిగా, బందరు పార్లమెంటు సభ్యుడిగా, ఈ రోజు అవనిగడ్డ శాసన సభ్యుడిగా మన మధ్యలో పని చేశారు. రైతాంగ సమస్యల పట్ల ప్రజా సమస్యల పట్ల ఆయన ఎనలేని కృషి చేసారు. ఎందుకంటే, ప్రజా జీవితంలో అయిదు దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉండి, ప్రతి రోజు దిన చర్యగా ప్రజాప్రతినిధిగా డైరీ రాసి, ఆ డైరీలో ఆ సమస్యల గురించి ఈ రోజు నేను ఏమి మాట్లాడాను, ఏమి చెప్పాను, ఏమి చేయాలనేది అయిదు దశాబ్దాల రాజకీయ చరిత్రలో బ్రాహ్మణయ్య గారు ఒక నిబద్ధతతో పని చేసిన వ్యక్తి.

ఉ.10.10

వారు నీతి, నిజాయితీలకు స్ఫూర్తినిచ్చే విధంగా మాతో కలిసి పనిచేశారు. వారొక గురువుగా నేనొక శిష్యుడిగా జిల్లాలో ప్రజా సమస్యల మీద మేమిద్దరం కలిసి పోరాటం చేసేవారం. కృష్ణా జిల్లా రైతాంగానికి

సాగునీరివ్వాలని పోతిరెడ్డిపాడు పాదయాత్ర కింద జిల్లాలో 477 కిలో మీటర్లు పాదయాత్ర చేశాము. రైతాంగానికి గిట్టుబాటు ధరలు, రైతాంగ సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి, ఒక రైతుగా ప్రతిరోజూ సైకిల్ మీద పొలానికి వెళ్లి వ్యవసాయం చేసి అందులోని కష్టాలను తెలుసుకొని రైతాంగం సమస్యల మీద పోరాటం చేసేవారు. వారు మచిలీపట్నం నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు. కాబట్టి వారి స్ఫూర్తితో మచిలీపట్నంలో, అవనిగడ్డలో వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. అదే విధంగా దక్షిణ భారతదేశ ఎమ్మెల్యేల క్రీడల పోటీల్లో వారు పాల్గొని ఏడు మెడల్స్ (సిల్వర్, గోల్డ్ కలిపి) సాధించడం జరిగింది. రాజకీయాలకు సంబంధించి మనందరం కూడా వారి స్ఫూర్తిని పాటించాల్సిన అవసరముంది. 50 సంవత్సరాలు రాజకీయ జీవితంలో ఉండి చాలా నిరాడంబరంగా గడిపారు. మచిలీపట్నంలో ఒక ప్రభుత్వ కార్యాలయానికి వారి పేరు పెట్టాలని కోరుతున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఇ. లక్ష్మీనారాయణ (నిజామాబాద్-అర్బన్)ః అధ్యక్షా, అంబటి బ్రాహ్మణయ్య గారు కిందిస్థాయి నుంచి రాజకీయాలలో అంచెలంచెలుగా ఎదిగి పార్లమెంట్ స్థాయివరకు వెళ్లి ప్రస్తుతం అవనిగడ్డ నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తూ పరమపదించినందున వారి కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తున్నాను. వారు రైతుల కోసం పరితపించిన వ్యక్తి. నీతి, నిజాయితీలతో రాజకీయాలలో మసిలిన వ్యక్తి కాబట్టి వారు లేని లోటు తీరనిది. ఈ సందర్భంగా వారి కుటుంబానికి వారు లేని లోటును తట్టుకునే శక్తిని ప్రసాదించాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జె.రంగారెడ్డి (మిర్యాలగూడ)ః అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు అంబటి బ్రాహ్మణయ్య గారు మన మధ్య లేకుండా ఇంత తొందరగా మరణిస్తారని అనుకోలేదు, అలా జరగడం చాలా దురదృష్టకరం. బ్రాహ్మణయ్య గారితోపాటు శాసనసభలో రెండు పర్యాయాలు నేను కూడా కలిసి పనిచేశాను. శాసనసభలో చాలా హుందాతనంగా సందర్భాన్ని బట్టి మాట్లాడేవారు, జిల్లాలో మంచి పేరున్న రాజకీయ నాయకుడు కాబట్టి వారి పేరుతో వారి నియోజకవర్గంలో వారి స్ఫూర్తిగా ప్రభుత్వ గ్రంథాలయం ఏర్పాటు చేసే విధంగా గౌరవ ముఖ్యమంత్రి గారు ఆలోచన చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. వారికి నా జోహార్లు అర్పిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి (బాన్సువాడ)ః అధ్యక్షా, అంబటి బ్రాహ్మణయ్య గారితో 1994 నుంచి శాసనసభలో కలిసి పనిచేసే అవకాశం మాకు కలిగింది. అంతే కాకుండా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్‌గా చాలా సంవత్సరాలు పని చేశారు. వారు అజాతశత్రువు. వారి పంచెకట్టు, నిండుతనాన్ని బట్టి చూస్తేనే ఒక రైతుగా కనబడేవారు. వారికి డెబ్బై అయిదు సంవత్సరాలు. నియోజకవర్గంలో కాని, రాష్ట్ర స్థాయిలో కాని అనేక సమస్యలపైన నిరాటంకంగా పోరాడిన వ్యక్తి. అన్నింటికంటే ముఖ్యమైన విషయం వారితోబాటు నన్ను కూడా ఎథిక్స్ కమిటీలో సభ్యులుగా నియమించారు, ఈ మధ్య కూడా ఆ కమిటీ సమావేశాలకు హాజరయ్యారు. చివరి సమావేశానికి వారు నడవలేని స్థితిలో కూడా వచ్చారు. నీతి, నిజాయితీకి మారు పేరు అంబటి బ్రాహ్మణయ్య గారు. వారు మంచి క్రీడాకారుడు. 1996-97లో ఇదే శాసనసభలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తే అందులో మొదటి బహుమతి పొందిన వ్యక్తి అంబటి బ్రాహ్మణయ్య గారు. వారు లేని లోటు ఈ శాసనసభలో ఒక పార్టీకే పరిమితం కాకుండా మంచి వ్యక్తిని కోల్పోయినందున శాసనసభకే లోటు కనబడుతున్నది. వారిని కేవలం కృష్ణా జిల్లాలో కాకుండా అన్ని జిల్లాలలో ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరమున్నది. వారు లేని లోటును ఎవరూ తీర్చలేరు. వారు చాలా మృదుభాషి. వారి మరణం పట్ల సంతాపాన్ని తెలియపరుస్తూ, వారి కుటుంబానికి

ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి.మల్లేష్ (బెల్లంపల్లి) : అధ్యక్షా, అంబటి బ్రాహ్మణయ్య గారు నాకు సుపరిచితులు. వారితోపాటు ఒక పర్యాయం శాసనసభ్యుడిగా పనిచేసే అవకాశం నాకు లభించింది. ఆయన నిరాడంబరమైన వ్యక్తి, ప్రజల సమస్యల మీద అవగాహన కలిగిన వ్యక్తి. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు పెట్టి శాసనసభ, పార్లమెంటు సభ్యుడిగా ప్రజాదరణ పొందిన ప్రజా నాయకుడు. వారు మరణించారనే వార్త పత్రికలలో చూసి దిగ్భ్రాంతి చెందాను. ప్రతి మనిషి ఎప్పుడో ఒకప్పుడు మరణించక తప్పదు కానీ వారి స్మృతులు, జ్ఞాపకాలు ఎప్పుడూ నిలిచిఉండే విధమైన భావన కలిగించిన వ్యక్తి అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. వారి మరణం పట్ల నా తరఫున, మా పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి స్మారక చిహ్నంగా వారి నియోజకవర్గంలో ఏదైనా ఉపయుక్తమైన నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావడం ద్వారా ఆయనకు శ్రద్ధాంజలి ఘటించినవారమవుతాం కనుక ఆ విధమైన కార్యక్రమానికి గౌరవ ముఖ్యమంత్రి గారు స్పందిస్తారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి.వెంకట బాలవర్ధనరావు (గన్నవరం): అధ్యక్షా, అంబటి బ్రాహ్మణయ్య గారి అకాల మరణం ఈ శాసనసభకు తీరని లోటు. బ్రాహ్మణయ్య గారు నీతి, నిజాయితీ నిరాడంబరతతో శాసనసభ్యుడిగా పని చేశారు. విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి. వారు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు నేను శాసనసభ్యుడిగా ఉండి ఆరోజున పార్లమెంట్ సమావేశాలు లేని తరుణంలో ప్రతి నియోజకవర్గంలోని తోటి శాసనసభ్యులను సమన్వయం చేసుకొని ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారు. రైతు సమస్యలు, ప్రజా సమస్యల గురించి చివరివరకు పోరాడిన వ్యక్తి, అటువంటి వ్యక్తిని కోల్పోవడం రాష్ట్రానికే తీరని లోటు. ఆయన మార్గదర్శకాలను మనందరం కూడా అనుసరించాల్సిన అవసరమున్నది. ముఖ్యంగా ఆయన నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి వరకు కూడా కట్టుబడి ఉన్న వ్యక్తి. ఎందుకంటే ప్రజారాజ్యం పార్టీ కొత్తగా వచ్చినప్పుడు అందులోకి మారమని వారి కుటుంబ సభ్యుల నుంచి తీవ్రమైన ఒత్తిడి వచ్చినప్పటికీ వారి సిద్ధాంతాలకు కట్టుబడి తెలుగుదేశం పార్టీ విలువలకి కట్టుబడి పనిచేయడం జరిగిందని నాతో ఒకసారి చెప్పారు. వారి జ్ఞాపకార్థం మచిలీపట్నంలో మెమోరియల్ ఏర్పాటుచేస్తే బాగుంటుందని ఈ ప్రభుత్వాన్ని కోరుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరడంతోబాటు వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.10.20

డా. జయప్రకాష్ నారాయణ్ (కూకట్‌పల్లి): అధ్యక్షా, అంబటి బ్రాహ్మణయ్య గారు పక్షపాతాలకు, పార్టీలకు, వివాదాలకు అతీతంగా చిత్తశుద్ధితో నిరంతరం తలెత్తుకుని బతికినటువంటి ఒక నిరంతర రాజకీయవేత్త. సహృదయుడైన సౌమ్యుడు. సచ్ఛీలతకు, నిజాయితీకి, నిరాడంబరతకు ప్రతీక. 50 ఏళ్ల పాటు అన్ని స్థాయిల్లో గ్రామ పంచాయతీ కావచ్చు, పంచాయతీ సమితి కావచ్చు, శాసనసభ కావచ్చు, లోక్‌సభ కావచ్చు; ఇప్పుడు మనందరినీ అర్థాంతరంగా వదిలి పరలోకసభకు వెళ్లిపోయారు. ఎక్కడున్నా కూడా చాలా హుందాగా, నీతివంతంగా, నిజాయితీగా చిత్తశుద్ధితో పక్షపాతాలకతీతంగా, రాగద్వేషాలకతీతంగా ఒక నిజాయితీపరుడైన రాజకీయవేత్త ఎట్లా ఉండాలో అలాగే వ్యవహరించారు. పాత తరానికి ప్రతీకగా ఆయన నిలిచారు. రాజకీయాల్లో విలువలంతరించిపోతున్నాయని అనుకుంటున్న కాలంలో ఇంకా ఈ సభలో అన్ని పక్షాల్లో అలాంటివారున్నారు. అది మన అదృష్టం. ఆ తరానికి ప్రతీకగా ఆయన నిలిచారు. వ్యవసాయరంగంలో

గానీ, గ్రామీణాభివృద్ధి విషయంలో గానీ, పేదరిక నిర్మూలనలో గానీ ఆయన నిరంతరం పడిన తపన, చేసిన కృషి శ్లాఘనీయమైనటువంటిది. రెండు అంశాల్లో ఆయన ప్రధానంగా నిలిచారు. అందులో మొట్టమొదటిది స్థానిక ప్రభుత్వాలకు మన రాజ్య వ్యవస్థలో కీలకమైన పాత్ర ఉండాలనే విషయమై ఆయన ఒక నిదర్శనంగా నిలిచారు. రెండవది ఇంకా విలువలతో కూడిన రాజకీయం లేకపోతే దేశం పతనమవుతుందని చెప్పడానికి నిదర్శనంగా నిలిచారు. కాబట్టి ఈ రెండు అంశాల విషయంలో మనమందరం పార్టీలకతీతంగా విలువల రాజకీయం కోసం, స్థానిక ప్రభుత్వాల కోసం గట్టిగా నిలబడి వాటిని బలోపేతం చేయడం కోసం ప్రయత్నం చేస్తామని ఆశిస్తూ వారి స్మృతికి చిహ్నంగా వారి నియోజకవర్గమైన కృష్ణా జిల్లా అవనిగడ్డ నందు ఒక మంచి సంస్థను గానీ, మరొకరకంగా గానీ ఏర్పాటు చేయాలనే అన్ని పార్టీల పెద్దల ఆలోచనతో పాటు నేను కూడా పూర్తిగా సమర్థిస్తూ వారి స్మృతికి అంజలి ఘటిస్తూ ఈ అవకాశం ఇచ్చిన మీకు నమస్కరిస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు (నగరి): శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారు ఈ లోకంలో లేని లోటు చాలా బాధాకరం. ఆయన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో పంచాయతీ బోర్డ్ మెంబర్ దగ్గర నుంచి గ్రామ సర్పంచ్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా, శాసనసభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా అంచెలంచెలుగా ఎదిగారు. ఆయన రాజకీయ జీవితం, ప్రస్థానం గల్లీ నుంచి ఢిల్లీ వరకు కొనసాగింది. తెలుగుదనం ఉట్టిపడేలా ఆయన పంచెకట్టు గానీ, ఆయన వేష భాషలు గానీ, ప్రజలతో ముచ్చటించే సందర్భంలో ప్రత్యేకంగా గౌరవ మర్యాదలకు ప్రాధాన్యమిచ్చేటటువంటి వ్యక్తి. కృష్ణా జిల్లాలాంటి రాజకీయ చైతన్యం కల్గినటువంటి జిల్లాలో ఒక పార్టీ అధ్యక్షులుగా, స్వర్గీయ శ్రీ ఎన్.టి.రామారావు గారు బతికున్న కాలంలో గానీ, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రస్తుత కాలంలో గానీ పదహేనేళ్ల కాలం పాటు పార్టీ బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి వారు. ఆయన అందరితో మంచిగా ఉంటూ కలుపుగోలు తనంతో ముందుకు వెళ్లేవారు. ఆ పదవిలో ఆయన అందరితో మంచి పేరు గడించారు. ఆయన రైతు సమస్యల పైన, ప్రజా సమస్యల పైన నిరంతరం పోరాడే వ్యక్తి. ఏ సమావేశానికైనా వారు హాజరవడమే గాకుండా ప్రజాపక్షాన అండగా నిలిచే వ్యక్తి. 1988వ సంవత్సరంలో నేను అటవీ శాఖ మంత్రిగా ఉన్న కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి గారైన స్వర్గీయ శ్రీ ఎన్.టి.రామారావు గారి ఆదేశానుసారం కృష్ణా జిల్లాలో జరిగిన అల్లర్లకు సంబంధించిన అంశంలో కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గానికి వెళ్లి ఆయనతో కలిసి రెండు రోజులు పర్యటించడం జరిగింది. కృష్ణా నది పైన బ్రిడ్జి నిర్మాణం కొరకు ఆనాడు కూడా ఆయన ప్రభుత్వం పైన వత్తిడి తీసుకురావడం జరిగింది. ఆ కారణంగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారు పట్టుబట్టి ఆ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టే విధంగా ప్రభుత్వంపైన వత్తిడి తెచ్చి నిర్మాణం జరిగేట్టుగా చూడగలిగారు. ఆ స్మృతికి చిహ్నంగా ఆ బ్రిడ్జికి ఆయన పేరు పెట్టాలని, ప్రస్తుతం అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యుడిగా, గతంలో బందరు లోక్‌సభ స్థానం నుంచి లోక్‌సభ సభ్యుడిగా పని చేశారు కాబట్టి ఆ యా ప్రాంతాల్లో శ్రీ అంబటి బ్రాహ్మణయ్య విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయనను మరియు ఆయన సేవలను పర్మనెంట్‌గా ప్రజలు గుర్తుపెట్టుకునే విధంగా, 50 ఏళ్ల జీవితంలో రాజకీయంలో ఉన్న వ్యక్తిగా, ప్రజలకు సేవ చేసిన వ్యక్తిగా, తెలుగుదనాన్ని ఉట్టిపడే విధంగా లోకానికి చాటిచెప్పిన వ్యక్తిగా ఆయన్ను గౌరవించాలని నేను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఆయన కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను. అదే విధంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

శ్రీ తంగిరాల ప్రభాకర్‌రావు (నందిగామ): ప్రజా సమస్యలపైన నిరంతరం పోరాడేటటువంటి వ్యక్తిగా, శాసనసభ్యులుగా చాలా కాలం మనతోపాటు పనిచేసినటువంటి వ్యక్తి గౌరవ శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారు. మనందరి మధ్య ఆయన భౌతికంగా లేకపోయినప్పటికీ ఆత్మీయంగా మన అందరి మధ్య ఉన్నటువంటి వ్యక్తిగా

వారు ఖ్యాతిని గడించారు. ఆయన ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి గల్లీ నుంచి ఢిల్లీ వరకు వెళ్లిన వ్యక్తి. ఆయన సామాన్య పంచాయతీ వార్డు మెంబర్ నుంచి ప్రజాప్రతినిధిగా పార్లమెంట్ వరకు వెళ్లి ప్రజా సమస్యల పట్ల నిరంతరం శ్రమించినటువంటి వ్యక్తి. ఆయన తెలుగు దేశం పార్టీకి ఒక రక్షకుడిగా పనిచేశారు. ఆయన అందరికీ ఆదర్శప్రాయుడు. ఆయన నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసినటువంటి వ్యక్తి. రైతు సమస్యలపైన ఆయన స్పందించిన తీరు నేను ఎప్పటికీ మరవలేను. భారతదేశ రైతు అప్పులో జన్మించి, అప్పుల ఊబిలో పెరిగి చివరకు చనిపోతున్నాడు, మనం అందుకు అడ్డుకట్టవేయాలని ఎల్లప్పుడు వారు నాతో అనే వారు. ఆయన "ఇంతింతై వటుడింతై" అనే చందాన అంచెలంచెలుగా ఎదుగుతూ రాజకీయ జీవితాన్ని గడిపిన వ్యక్తి. ప్రజా సమస్యల పట్ల, రైతు సమస్యల పైన మనం నిరంతరం శ్రమించాలి అని వారు నాకు చెప్పే వారు. ఆయన చూపిన ఆదర్శం, గ్రామాలకు ఆయన చేసిన సేవలు, అవనిగడ్డకు మరియు బందరు ప్రాంతాలకు ఆయన చేసిన సేవలు ఎప్పుడు కూడా మనం గుర్తుంచుకోవాలి. అటువంటి మహా నాయకుడికి మృతికి స్మృతిగా ఆ యా ప్రాంతాలకు ప్రభుత్వం ఒక మంచి పని చేసినట్లైతే బాగుంటుందని నేను భావిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని సభాముఖంగా తెలియజేస్తూ, మాట్లాడే అవకాశం కల్పించిన మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. నరేంద్ర కుమార్ (పొన్నూరు): శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారు గ్రామ స్థాయి నుంచి, పంచాయతీ సర్పంచ్ నుంచి, శాసనసభ్యులుగా, పార్లమెంట్ సభ్యుడి స్థాయి వరకు అంచెలంచెలుగా వారు ఎదగడం జరిగింది. ఈ శాసనసభలో సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా విశేషమైన సేవలు వారందించడం జరిగింది. అలాగే తెలుగుదేశం పార్టీపరంగా, జిల్లా పార్టీ అధ్యక్షులుగా, రాష్ట్ర స్థాయిలో నాయకుడిగా తెలుగు దేశం పార్టీకి అంకిత భావంతో పనిచేసినటువంటి వ్యక్తి వారనే విషయాన్ని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అలాగే ఆయన వివాదరహితుడు. నైతిక విలువలు కల్గిన వ్యక్తి, క్రమ శిక్షణ కల్గిన వ్యక్తి శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారు. నైతిక విలువలకు నిలువుటద్దంగా శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారిని మనం చెప్పుకోవచ్చనే విషయాన్ని కూడా నేను తెలియజేస్తున్నాను. ఆయన పంచెకట్టు గానీ, ఆయన రూపం, ఆయన వేషభాషలు గానీ రైతాంగాన్ని దగ్గరగా చేసింది. అలాగే మాలాంటి యువకులకు ఆయన ఎంతో ఆదర్శప్రాయంగా నిలిచిన వ్యక్తి. ఈ సభలో గానీ, పార్లమెంట్ నందు గానీ రైతు సమస్యలను ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో ఉన్న రైతాంగం, కాలువ చివరి భూములో ఉన్న రైతాంగం యొక్క బాణిని వారు వినిపించడం జరిగింది. అలాగే ఆయన పెద్ద వాళ్లలో పెద్దవాడిగా, యువకుల్లో యువకుడిగా నిరంతరం ఉత్సాహంతో అనేక కార్యక్రమాల్లో వారు పాల్గొనేవారు. ఈ శాసనసభ తరఫున గతంలో స్పోర్ట్స్ నిర్వహించిన సందర్భంలో కూడా, వయస్సు ఎక్కువైనా సరే కుర్రవాళ్లతో పోటీపడి ఎన్నో కార్యక్రమాల్లో వారు పాల్గొని పలు అంశాల్లో ఆయన ప్రథమ స్థానంలో నిలబడ్డారంటే అది ఆయన స్ఫూర్తికి నిదర్శనమనే విషయాన్ని నేను తెలియజేస్తున్నాను. ఎందుకంటే నిన్నటి దాక ఉన్నటువంటి శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారు ఇవాళ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. అందులో వారు అనారోగ్యంతో మరణించారంటే చాలా బాధ, ఆవేదన కల్గిస్తోందని కూడా నేను తెలియజేస్తున్నాను. ఎందుకంటే వారు జీవితంలో ఒక క్రమశిక్షణతో మెలిగినటువంటి వ్యక్తి. ఆయన నిత్యం పొద్దునే నాలుగు, నాలుగున్నర గంటలకు నిద్ర లేచి ఒక గంట సమయం పాటు యోగా ఖచ్చితంగా చేస్తారు. యోగా అయ్యాకే మిగతా కార్యక్రమాలను నిత్యం నిర్వహించేటటువంటి వ్యక్తి శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారు. నేను చాలా పర్యాయాలు ప్రత్యక్షంగా చూడటం జరిగింది. అంటే ఆయన వ్యక్తిగతంగా క్రమశిక్షణ కల్గిన జీవితం గడుపుతూ కూడా అనారోగ్యానికి గురై మరణించారంటే ఆ విషయం మాకందరికీ ఎంతో ఆవేదనను మిగిల్చిందనే విషయాన్ని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. వారు లేని లోటు ఇవాళ ఉన్న రాజకీయ

పరిస్థితుల్లో, అటువంటి నిబద్ధత కల్గిన నాయకుడు, నైతిక విలువలు కల్గిన వ్యక్తి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఆయనలో మనం చూడగలిగాము. ఇవాళ ఆయన మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. వారి మృతికి నివాళులర్పిస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి మా ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ, ఈ అవకాశం కల్గించిన మీకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

**ఉ.10.30**

డా. జి. కుతూహలమ్మ : అధ్యక్షా, గౌరవ పెద్దలు చెప్పినట్లు అంబటి బ్రాహ్మణయ్య గారు గ్రామ పంచాయితీ వార్డు మెంబరు, గ్రామ సర్పంచ్ నుండి పార్లమెంట్ స్థాయి వరకు పని చేశారు. ఆయన మంచి రాజకీయ వేత్త, క్రీడా కారుడు అని కూడా చెప్పడం జరిగింది. వారు సీనియర్ సిటిజన్‌గా ఉండి కూడా ఉత్సాహ వంతంగా క్రీడల్లో పాల్గొనిన వ్యక్తి. అటువంటి అంబటి బ్రాహ్మణయ్య గారిని ఉద్దేశించి ఇక్కడ చెప్పవచ్చో లేదో కానీ, నాకు మాత్రం ఖచ్చితంగా చెప్పాలని ఉంది. అందరికి తెలియక పోవచ్చు ఆయన హాస్య ప్రియుడు. "నవ్వు మంచి యోగమంటారు" ఎందుకంటే గతంలో మేము అందరం స్టేడియంలో పాటలు, అంత్యాక్షరీ వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నపుడు బ్రాహ్మణయ్య గారు నాకు పాటలు రావు నేనొక జోక్ చెబుతాను అన్నారు. అదీ కూడా వాస్తవంగా జరిగిన జోక్ చెబుతానన్నాడు.

వారి గ్రామంలో ఒక రైతు కూలి ఉదయాన్నే తన వద్దకు వచ్చి నేను డాక్టరు దగ్గరకు పట్నం పోతున్నాను, నాకొక లెటరు ఇవ్వమని అడిగారట, సరే ఇస్తాను, చేతిలో ఏంటి చెంబు ఉందంటూ, ఈ రోజుల్లో కూడా పెద్దమనుష్యులు/డాక్టరు దగ్గరకు వెళ్లేటప్పుడు నెయ్యి తీసుకు వెళ్లాలనా? అని అడుగగా, ఆ రైతు కూలి నెయ్యి కాదు సార్ వైద్య పరీక్ష నిమిత్తం డాక్టరు గారు మూత్రము తీసుకు రమ్మన్నారు, చెంబుతో మూత్రము తీసుకు వెళుతున్నట్లు తెలిపారని చెప్పారు. ఇది వాస్తవం, నేను కల్పించుకొని చెబుతున్న మాటలు కాదు. మూత్ర పరీక్షకు చెంబుతో మూత్రం అవసరం లేదని బ్రాహ్మణయ్య గారు చిన్నసీసా మూత్రం చాలని చెప్పి వేడి నీళ్లతో శుభ్రపరచిన కాళీ సీసాను ఆ రైతు కూలీకిచ్చి సీసా మూత్రం పోను మిగిలిన మూత్రం పారబోయించారు. అలాంటి ఉదాహరణలతో మమ్మలను బ్రాహ్మణయ్య గారు నవ్వించారు. అందువల్ల చెప్పాల్సి వచ్చింది.

ఏది ఏమైనా ఒక సీనియర్ రాజకీయ నాయకులు, పేద గ్రామీణ ప్రజల కోసం, గ్రామీణాభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తి ఈ రోజు మన మధ్యన లేకుండా పోవడం ఎంతైనా బాధాకరం. తెలుగుదేశం పార్టీ వారు ఈ లోటు మా పార్టీకే అనుకోవచ్చు, మీతోపాటు, పేద వర్గాల వారికి, రాష్ట్రానికి కూడా ఆ లోటు ఉంది. అందువల్ల వారి ఆత్మకు శాంతి, వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యం కలగాలని మీ ద్వారా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : పార్థసారధి గారు.,

శ్రీ కె. పార్థసారధి (మాధ్యమిక విద్యాశాఖా మంత్రి) : అధ్యక్షా, అంబటి బ్రాహ్మణయ్య గారి మరణం రాష్ట్రానికి తీరని లోటు. ప్రత్యేకించి మా కృష్ణా జిల్లాకు తీరని లోటు, ఎందుకంటే ఆయన మా జిల్లా సమస్యల పట్ల , రైతు సమస్యల పట్ల ఇరిగేషన్ సమస్యల పట్ల ఎక్కువగా స్పందిస్తూ ఉండే వారు. అంతే కాకుండా ఆయన

జిల్లా పరిషత్ మీటింగ్స్‌లో కానివ్వండి, మరేదైనా సమావేశాల్లో వాస్తవాలు మాట్లాడే వారు. కానీ ఎప్పుడు కూడా ప్రచారం కోసం మాట్లాడే వారు కాదు. ముఖ్యంగా వారి నియోజక వర్గంలో ప్రభుత్వం ఏ కార్యక్రమం నిర్వహించినా విధిగా హాజరవుతూ ఉండేవారు. అంతే కాదు, ఆ కార్యక్రమం మంచిదైతే బాహాటంగా చెబుతుండేవారు. ఉదాహరణకు గతంలో బాధితులకు ప్రభుత్వం నుండి నష్ట పరిహారం అందితే వెంటనే బాగా పని చేశారు మీ ప్రభుత్వం తొందరగా అందించింది అని అభినందిస్తూ , చాలా హుందాగా ప్రవర్తించారు. ఆయన ఈ రోజు లేకపోవటం మనందరికీ కూడా చాలా తీరని లోటు. అంతే కాకుండా వారి నియోజక వర్గంలోని ఇరిగేషన్ పనులన్నింటినీ ప్రత్యేకించి ఎల్లవేళలా పర్యవేక్షిస్తుండేవారు. ఏ సమస్య ఉన్నా ప్రభుత్వంతో మాట్లాడడం లోగానీ అదే విధంగా పాఠశాలల విషయంలో కూడా ఉపాధ్యాయులు సరిగా పాఠశాలకు రాకపోవడం గురించి కానీ మరేదైనా విషయాలు గురించి, అభివృద్ధి గురించి తరచుగా, వారు నాతో మాట్లాడుతూ ఉండేవారు. ఆయన అనారోగ్యంతో మరణించారంటే ఆశ్చర్య కరమైన విషయం ఎందుకంటే ఆయన లాగా ఆహార నియమాలు కానీ ఆరోగ్య నియమాలు కానీ పాటించే వారు ఈ శాసన సభలో బహుశా ఎవరూ ఉండరేమో అనుకుంటున్నాను. ఎందుకంటే వారు ఉదయం, సాయంత్రం విధిగా యోగా చేసేవారు, ఆ సమయంలో ఎవరితోనూ మాట్లాడేవారు కాదు.

అటువంటి వ్యక్తి అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరం. ఎంతో హుందాగా ఈ తరం రాజకీయ నాయకులకు ఆయన స్ఫూర్తి, మరియు ఆదర్శ ప్రాయుడని నేను భావిస్తున్నాను. ముఖ్యమంత్రి గారు కూడా బ్రాహ్మణయ్య గారి విగ్రహాన్ని అవనిగడ్డ ప్రాంతంలో ఏదైనా సరైన స్థలం గుర్తించి నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని నాతో చెప్పడం జరిగింది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ : అరుణ కుమారి గారు ,

శ్రీమతి జి. అరుణ కుమారి (గనులు మరియు భూగర్భ వనరుల శాఖా మంత్రి ) : అవనిగడ్డ శాసన సభ్యులు శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారి మృతి పత్రికల్లో చూడగానే చాలా దిగ్భ్రాంతిని కలిగించింది. నేను కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పుడు వారితో కొంచెం పరిచయ భాగ్యం ఏర్పడింది. వారి వస్త్రధారణ, వ్యవహార శైలి, చూచిన ఎదుటి వారికి చేయెత్తి నమస్కరించాలని అనిపించే విధంగా ఉంటుంది. ఆయన చనిపోవడం రాష్ట్రానికి చాలా దురదృష్టకరం. పెద్దవాళ్లు చెబుతుంటారు, " పదిమంది అడుగుల్లో అడుగు కలిపి నడిచేవాడు, పదిమందికి సేవ చేసే వాడు, పదిమంది యొక్క బాగోగులు విచారించే వాడు ఎవరైనా చనిపోతే తీరిక ఉంటే వెళ్లి పిడికెడు మట్టి వేసి శ్రద్ధాంజలి ఘటించమని చెప్పారు. " కానీ నాకు ఆ అవకాశం లేక పోయినప్పటికీ వారి గురించి నాలుగు మాటలు చెప్పి వారికి శ్రద్ధాంజలి ఘటించాలని అనుకుంటున్నాను.

నేను కృష్ణా జిల్లా ఇన్ చార్జ్‌గా పని చేసిన కాలాల్లో జరిగిన డిస్ట్రిక్ట్ రెవ్యూ కమిటీ సమావేశాలు ఎప్పుడూ కూడా ఏ గొడవలు లేకుండా ముగిసేవి కాదు. కానీ అప్పుడు కూడా ఆయన ఎంతో హుందాగా నిబద్ధతతో వ్యవహరించే నాయకుడు ఆయన ఒక్కరే అని నేను చెబుతున్నాను. వారి నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు గురించి, రైతుల గురించి వారు కోరడం వాటిని నేను చేయడం కూడా జరిగింది. వారు నీతి, నిబద్ధత కలిగిన మంచి రైతు నాయకులు. వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలియజేస్తూ ఈ చిన్న శ్రద్ధాంజలి ఘటించు కుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ ః బొత్సా సత్యనారాయణ గారు,

శ్రీ బొత్స సత్యనారాయణ ః  అధ్యక్షా, అంబటి బ్రాహ్మణయ్య గారి మృతి పట్ల నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారు మంచి సౌమ్యుడు, స్నేహశీలి. పన్నెండవ లోక్ సభలో వారు నేను కలిసి పార్లమెంట్ సభ్యులుగా పని చేశాము. వారి మరణ వార్త నాకు దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ సందర్భంగా వారి మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ, ఏదైతే గౌరవ మంత్రి కె.పార్థసారథి చెప్పారో దానికితోడు వారి కుటుంబానికి మనందరం కూడా  అండగా ఉండాలని కోరుకుంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని మరొక్కసారి భగవంతుణ్ణి ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ ః  ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

శ్రీ అంబటి బ్రాహ్మణయ్య గారు 1940 జనవరి 13వ తేదీన దివి సీమలోని నాగాయలంక మండలం, వక్కపట్లవారి పాలెంలో జన్మించారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన బ్రాహ్మణయ్య గారు వ్యవసాయదారుడుగా జీవితాన్ని ప్రారంభించారు. 1964లో వక్కపట్లవారి పాలెం గ్రామ పంచాయితీ వార్డు మెంబరుగా  రాజకీయ జీవితం ప్రారంభించారు. 1994  సంవత్సరం నుండి 1999వ  సంవత్సరం వరకు బందరు శాసన సభ్యునిగా పనిచేశారు.  శ్రీ బ్రాహ్మణయ్య గారు 1995 సంవత్సరంలో రొయ్యల సాగుపై సభా సంఘానికి అధ్యక్షులుగా, మరియు 1996వ సంవత్సరంలో ప్రభుత్వ భూదాన భూముల అక్రమ విక్రయాలపై సభా సంఘంలో సభ్యునిగా పనిచేశారు.

శ్రీ బ్రాహ్మణయ్య గారు 1999 సంవత్సరం నుండి 2004 వరకు మచిలీపట్నం పార్లమెంటు సభ్యునిగా పనిచేశారు. వీరు 2009 సంవత్సరంలో 13వ శాసన సభ్యునిగా అవనిగడ్డ నియోజక వర్గం నుండి ఎన్నికయ్యారు. శాసన సభ అంచనాల కమిటీ, నైతిక విలువల కమిటికి సభ్యునిగా పనిచేశారు.  ఎంఎ పట్ట భద్రులైన శ్రీ బ్రాహ్మణయ్య గారు,  చట్ట సభలలోనూ, వెలుపల ఉన్నత విలువలు పాటిస్తూ తన నియోజక వర్గంలోనూ, రాష్ట్రంలోనూ గల రైతులకు పేదలకు నిరంతరం సేవలు అందించిన ఒక మంచి పార్లమెంటేరియన్. వీరు 2013 సంవత్సరం ఏప్రిల్ 21వ తేదీన మరణించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కొద్ది సేపు మనందరం మౌనం పాటిద్దాం.

(సభ  రెండు నిమిషాల పాటు మౌ నం పాటించింది. )

Mr. Speekar  ః Now the  House is Adjourned to meet again at 9 AM tomorrow.

( The House then adjourned at 10.40 AM, to meet again at 9 AM on Tuesday, the 11 of the june, 2013.)